నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 26 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

'వట్టి' పోతున్నది..!

వట్టివాగు ప్రాజెక్టులో ఓపెన్‌కాస్టు మట్టి డంపు

- ఇప్పటికే 26 ఎకరాల వరకు పూడ్చేసిన సింగరేణి
- ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం
- బొగ్గు నిక్షేపాల కోసం కావాలనే చేస్తున్నట్లు అనుమానాలు
- తీరని నష్టం జరిగాక రూ.11 కోట్లతో రక్షణ కట్టల ఏర్పాటుకు చర్యలు!

వట్టివాగు ప్రాజెక్టు నీటిని ఆనుకొని పోస్తున్న ఓపెన్‌కాస్టు మట్టి

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : వందలాది గ్రామాలను మింగేసిన సింగరేణి డోర్లి ఓపెన్‌కాస్ట్.. వట్టి వాగు ప్రాజెక్టును సైతం కబళిస్తున్నది. కేంద్ర జల సంఘం నిబంధనలను కాలరాస్తున్న సింగరేణి.. అనువుగాని చోట బొగ్గు తవ్వకాలు చేపడుతూ ఓపెన్‌కాస్టు మట్టి కుప్పలతో ప్రాజెక్టును ముంచుతున్నది. ఫలితంగా 25 వేల ఎకరాలకు సాగునీరందించే జలాశయం కనుమరుగయ్యే పరిస్థితి దాపురించగా, రైతాంగం ఆందోళన చెందుతున్నది.

1998లో ప్రాజెక్టుకు శ్రీకారం

1998లో అప్పటి ప్రభుత్వం ఆసిఫాబాద్ మండలంలో వట్టి వాగు ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో పెద్దవాగుపై ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దీని నిర్మాణానికి మొదటి దశలో రూ.90 కోట్లు, రెండో దశలో రూ.100 కోట్లు వెచ్చించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి 2000లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశారు. ప్రాజెక్టు ఏర్పాటుతో ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరందుతున్నది. ఇంత వరకు బాగానే ఉన్నా కొన్నేళ్లుగా డోర్లి ఓపెన్ కాస్టు మట్టిని ప్రాజెక్టులో డంప్ చేస్తుండడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారుతున్నది.

ప్రాజెక్టు కనుమరుగేనా..!

ఈ ప్రాజెక్టు వెనుక భాగంతో డోర్లీ ప్రాంతంలో భారీ ఓపెన్‌కాస్టుకు రూపకల్పన చేశారు. కేంద్ర జల సంఘం నిబంధనల ప్రకారం నీటి పారుదల వనరులన్న చోట ఇతర ప్రాజెక్టులు నిర్మించరాదు. ఈ నిబంధనలు తుంగలో తొక్కి వట్టివాగు ప్రాజెక్టు నీరు నిల్వ ఉన్నచోటే ఓపెన్ కాస్టు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నిల్వ ఉండే చోటే ఓపెన్ కాస్టు మట్టిని డంప్ చేస్తున్నారు. వర్షాకాలంలో మట్టి కరుగుతూ క్రమంగా ప్రాజెక్టులో పూడిక పేరుకుపోతున్నది. సింగరేణి యాజమాన్యం ప్రాజెక్టులోకి మట్టి చేరకుండా కనీసం రక్షణ గోడలు కూడా నిర్మించలేదు. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కనుమరుగయ్యే ప్రమాదమున్నది. కేవలం ప్రాజెక్టు గేట్లు, కాల్వలు మాత్రమే మిగిలిపోయే దుస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దాదాపు 26 ఎకరాల్లో ఓపెన్ కాస్ట్ మట్టితో పూడ్చేసినట్లు తెలుస్తున్నది.

కావాలనే చేస్తున్నారా..?

సింగరేణి అధికారులు ప్రాజెక్టులో కావాలనే మట్టిని డంప్ చేస్తున్నారా..! అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు కింద కోట్లాది రూపాయల బొగ్గు నిక్షేపాలు నిక్షిప్తమై ఉన్నాయని, అందుకే సాగునీరందించే వట్టివాగు ప్రాజెక్టు నిర్వీర్యానికి సింగరేణి కుట్ర చేస్తున్నదని గిరిజనులు, ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కాలువలు పూడుకుపోయి పంటలకు నీరందించలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు ప్రాజెక్టులో నిండే మట్టి, బొగ్గుతో నీళ్లు కూడా కలుషితమవుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో సాగునీటి శాఖ ఎందుకు స్పందించడం లేదన్న సందేహాలు కలుగుతున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టులో పూడుకుపోయిన మట్టిని తీయాలంటే కోట్లాది రూపాయలు ఖర్చవుతున్నది. అసలు ప్రాజెక్టుకు వెనకాలే ఆనుకొని ఓపెన్ కాస్టు ఏర్పాటు చేస్తుంటే సాగునీటి శాఖ వారు ఎందుకు అభ్యంతరం చెప్పలేదనేది ఇప్పటికీ అర్థం కావడం లేదని పలువురు గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మరోవైపు సింగరేణి ఇప్పటికే కైరి గూడ, డోర్లి ఓపెన్ కాస్టుతో ప్రాజెక్టుకు ఇబ్బంది కలుగుతుండగా, యాజమాన్యం వీటిని విస్తరించే పనిలో ఉంది. దీంతో ప్రాజెక్టు భవితవ్యం పూర్తిస్థాయిలో ప్రమాదకరంగా మారే పరిస్థితి నెలకొన్నది. అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణిని విస్తరించేందుకు అనుమతులు ఇవ్వకూడదని రైతులు కోరుతున్నారు. ఇదే జరిగితే ప్రాజెక్టుతోపాటు తమ భవిష్యత్ అంధకారంలో పడుతుందని రైతులు, ఈ ప్రాంత గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

రూ. 11.24 కోట్లతో రక్షణ గోడలు

వట్టివాగు ప్రాజెక్టు మట్టి డంపింగ్‌తో పూడుకుపోతుండగా రూ.11.24 కోట్లతో రక్షణ కట్టలు ఏర్పాటు చేసేందుకు ఇటీవల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పనులకు శంకుస్థాపన చేశారు. ఓపెన్ కాస్ట్ మట్టితో ప్రాజెక్టుని పూడ్చేస్తున్న సమయంలో స్పందించని అధికారులు జరగాల్సిన నష్టం జరిగాక రక్షణ కట్టల పేరుతో రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

విద్యార్థులతో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, అక్టోబర్ 25 : విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కోటపల్లిలో ఆకస్మికంగా పర్యటించారు. మొదట పీహెచ్‌సీని సందర్శించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరగా పరిష్కరించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల గురించి కార్యదర్శి సత్యనారాయణను అడిగారు. ఆశ్రమ, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లు, ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటనతో అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టారు. 11 గంటలైనా కార్యాలయాలకు రాని అధికారులు హుటాహుటిన చేరుకోవడం కనిపించింది. వైద్యాధికారిణి అరుణశ్రీ, ఇన్‌చార్జి ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, ఏపీవో బాలయ్య, హెచ్ఎం మధుసయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్వే నంబర్ 42లో టీఎన్జీవోలు నిర్మిస్తున్న ఇండ్లు

పైసా కట్టకుండా పర్మిషన్ ఎలా..?

టీఎన్జీవో హౌసింగ్ సొసైటీలో అక్రమాలు

- డబ్బులు చెల్లించకున్నా ఇండ్ల నిర్మాణానికి మున్సిపాలిటీ అనుమతులు
- ఇందులో కీలకంగా వ్యవహరించిన జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారి
- డీసీవో విచారణకు సహకరించని ఉద్యోగులు
- సర్కార్‌ను మోసం చేసిన వైనం
- సరైన రెస్పాన్స్ లేకున్నా.. చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం

మంచిర్యాల, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాలలోని టీఎన్జీవో హౌసింగ్ సొసైటీలో తవ్వుతున్న కొద్దీ అక్రమాలు బయట పడుతూనే ఉన్నాయి. స్థానిక కలెక్టరేట్ ముందున్న సర్వే నంబర్ 42లో 32.02 ఎకరాల భూమిని 2000లో టీఎన్జీవోలకు అప్పుడున్న సర్కారు అప్పగించింది. జిల్లాలోని 350 మంది టీఎన్జీవోలకు అప్పుడున్న మార్కెట్ విలువ ప్రకారం కేటాయించిన భూమికి డబ్బులు కట్టాలని ఆదేశించింది. కానీ, ఆ డబ్బులు ప్రభుత్వానికి కట్టకుండానే.. 2010లో టీఎన్జీవోలకు పట్టాలు అందాయి. అసలు ప్రభుత్వానికి డబ్బులు కట్టకుండా అప్పుడున్న తహసీల్దార్ పట్టాలు ఎలా ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ ఆ తహసీల్దార్ అధికార దుర్వినియోగం చేశారా.. లేకపోతే ఆయన్ని ఎవరైనా తప్పుతోవ పట్టించారా.. అన్నది తేలాల్సి ఉంది. సరే అప్పుడున్న తహసీల్దార్ ఏదో ఇచ్చారనుకుంటే ఆ పట్టాలను చూపించి గ్రామ పంచాయతీ పర్మిషన్‌తో 90 మంది ఇండ్ల నిర్మాణాలు చేశారు. నస్పూర్ మున్సిపాలిటీ ఏర్పడ్డాక ఇప్పుడూ అవే పట్టాలు చూపించి దాదాపు 80 ఇండ్లు కడుతున్నారు. మరి ఇప్పుడున్న అధికారులు ఎందుకు టీఎన్జీవోల నుంచి గవర్నమెంట్‌కు రావాల్సిన డబ్బులు కట్టించుకోలేదు. అసలు మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణానికి పర్మిషన్ ఎలా ఇచ్చారు. దీని వెనుక ఏం జరిగిందో తెలుసుకుందాం.

రెవెన్యూ ఉన్నతాధికారి ప్రమేయం..

టీఎన్జీవో హౌసింగ్ సొసైటీకీ మాత్రమే 2002లో గవర్నమెంట్ ఫిజికల్ పొజిషన్ ఇచ్చింది. అందులోని సభ్యులకు పట్టాలు సైతం జారీ చేసింది. కానీ మారిన నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణానికి ఓనర్‌షిప్ డాక్యుమెంట్స్ తప్పనిసరి. టీఎస్‌బీపాస్ ఆన్‌లైన్‌లో పోర్టల్‌లో ఆ ధ్రువపత్రాలు కచ్చితంగా అప్‌లోడ్ చేయాలి. అది కావాలంటే డీటీసీపీ లే-అవుట్‌తో పాటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కూడా ఉండాలి. కానీ టీఎన్జీవోలకు అవేవి లేకుండానే ఇండ్ల నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చారు. 2010లో అప్పటి తహసీల్దార్ ఇచ్చిన పట్టాలనే టీఎస్‌బీపాస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు మినహాయింపు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు టీఎన్జీవో అధ్యక్షుడు నవంబర్ 2022లో లేఖ రాశారు. దాన్ని మున్సిపల్ కమిషనర్ అప్పుడున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఏసీఎల్‌బీ)కి పంపించారు. కలెక్టర్ డీఎంఏ(డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్)కి పంపించారు. డీఎంఏ నుంచి డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ)కి లెటర్ రాశారు. దీంతో డీటీసీపీ టీఎస్‌బీపాస్‌లో ఓనర్‌షిప్ డాక్యుమెంట్ బదులు పట్టా సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసి పర్మిషన్ తీసుకునేందుకు అనుమతులు ఇచ్చింది. ఇక్కటి వరకు బాగానే ఉన్నా.. టీఎన్జీవోలు అధికారులకు డీటీసీపీ అప్రూవల్ ఉన్నట్లు లెటర్ పెట్టి మున్సిపల్, జిల్లా అదనపు కలెక్టర్‌ను బోల్తా కొట్టించినట్లు తెలుస్తుంది. వాస్తవానికి ఈ లే-అవుట్ డీటీసీపీ అప్రూవల్ లేదని టీఎన్జీవోలే చెబుతున్నారు. ఇలా తప్పుడు సమాచారంతో మరోసారి టీఎన్జీవోలు అధికారులను మోసం చేశారనే ఆరోపణలు విపిస్తున్నాయి. కాగా టీఎన్జీవోలు గవర్నమెంట్‌కు డబ్బులు కట్టారా లేదా అన్నది క్రాస్ చెక్ చేసుకోకుండానే మున్సిపల్ కమిషనర్ ఏసీఎల్‌బీ, ఆయన మున్సిపల్ డైరెక్టర్‌కు ఇండ్ల నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వాలని ఎలా ప్రతిపాదించారన్నది అర్థం కావడం లేదు. పైగా అప్పుడున్న ఏసీఎల్‌బీనే రెవెన్యూ శాఖ ఉన్నతాధికారిగా ఉన్నారు. మరి ఆయన ఎందుకు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోలేదన్నది అర్థం కావడం లేదు.

డీటీసీపీ పర్మిషన్ ఉంది..

డబ్బులు కట్టినమంటూ బుకాయింపు..

కాగా, ఈ విషయంలో టీఎన్జీవో అధ్యక్షుడు శ్రీహరిని వివరణ కోరగా.. డబ్బులు కట్టాకే మాకు ల్యాండ్ అలినేషన్ చేశారన్నారు. డబ్బులు కట్టకుండా ఎలా పట్టాలిస్తారు. కట్టినం కాబట్టే ఇచ్చారని చెప్పారు. మరి డబ్బులు కట్టినట్లు ఏమైనా ఆధారాలున్నాయా.. అంటే మాత్రం గతంలో ఉన్న కమిటీ కట్టిందని, దానికి సంబంధించి ఎలాంటి పేపర్లు మా దగ్గర లేవంటూ మరో సమాధానం చెప్పారు. ఇక డీటీసీపీ పర్మిషన్ ఉందనే చెప్పారు. ఆ పర్మిషన్ కాపీ ఇవ్వాలని అడిగితే ఆయన నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఇదే విషయమై కలెక్టర్ కుమార్ దీపక్‌ను వివరణ కోరగా.. టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ ప్రభుత్వానికి ఎలాంటి డబ్బులు కట్టలేదన్నారు. ఈ విషయంపై సీసీఎల్‌ఏకు లెటర్ రాశామన్నారు. సీసీఎల్‌ఏ ఎంత డబ్బులు డిపాజిట్ చేయమంటే అన్ని డబ్బులు వాళ్లు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఇచ్చిన గడువులోగా వాళ్లు పేమెంట్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కలెక్టర్ ఇచ్చిన వివరణతో టీఎన్జీవో అధ్యక్షుడు ఈ విషయంలో అబద్ధం చెప్పారని ఇక్కడ స్పష్టం అవుతున్నది.

విచారణకు సహకరించని టీఎన్జీవోలు..

ప్రస్తుతం డీసీవో (డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ ఆఫీసర్) సంజీవరెడ్డి ఆధ్వర్యంలో టీఎన్జీవో హౌసింగ్ సొసైటీపై జరుగుతున్న విచారణకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కో-ఆపరేట్ చేయడం లేదని సమాచారం. మరి విచారణకు సహకరించని వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనేది అర్థం కావడం లేదు. టీఎన్జీవో సొసైటీ సభ్యులు విచారణకు సహకరించని పక్షంలో ఇప్పుడు జరుగుతున్న నిర్మాణాలను విచారణ పూర్తయ్యే వరకు నిలిపివేయకుండా ఎందుకు చోద్యం చూస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక టీఎన్జీవో సొసైటీపై విచారణ జరిగింది. ఆ సమయంలో నిర్మాణ పనులు చేయొద్దని అప్పుడున్న అధికారులు ఆదేశించారు. నిర్మాణాలు నిలిపివేస్తేనైనా టీఎన్జీవోలు విచారణకు సహకరిస్తారేమో.. అది చేయకుండా అధికారులు మినమేషాలు లెక్కించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచారణ పేరుతో కాలయాపన చేయడం పరోక్షంగా ఇండ్ల నిర్మాణాలకు సహకరించేందుకే తప్ప.. వేరేది ఏం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ కోసం ఏ రిపోర్ట్ అడిగినా టీఎన్జీవోలు వారం నుంచి పది రోజుల గడువు కోరుతున్నారు. మరోవైపు శరవేగంగా పనులు చేయిస్తున్నాయి. అన్ని సక్రమంగా ఉన్నట్లయితే డీసీవో అడిగిన వివరాలు ఇచ్చేందుకు ఎందుకు గడువు కోరుతున్నారు. అడిగింది వెంటనే ఇవ్వడానికి ఎందుకు జంకుతున్నారు అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటారా.. టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గం మంచిర్యాల వివాదంపై ఎలా స్పందిస్తుందన్నది తేలాల్సి ఉంది.

చింతలమానేపల్లి మండలం దిందా గ్రామంలో డప్పు చాటింపుతో అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఏ సమయంలోనైనా జిల్లాలోకి వచ్చే అవకాశం
- అటవీ ప్రాంత గ్రామాల్లో భయాందోళనలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- గతంలో ఇద్దరిని బలిగొన్న ఏనుగు

సరిహద్దులో గజ గజ..!

ప్రాణహిత అవతల ఏనుగు సంచరిస్తుందన్న సమాచారం

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ పెంచికల్‌పేట్, అక్టోబర్ 25 : ప్రాణహిత సరిహద్దు గ్రామాలు గజరాజు భయంతో వణికిపోతున్నాయి. గత ఏప్రిల్‌లో ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు మృతి చెందిన విషయం మర్చిపోకముందే.. మళ్లీ ప్రాణహిత అవతల ఏనుగు సంచరిస్తుందన్న సమాచారం ఆందోళన కలిగిస్తున్నది. ఏ సమయంలోనైనా జిల్లాలోకి ప్రవేశించే అవకాశముండగా, ఇక్కడి ప్రజలకు కంటి మీద కునుకులేకుండా పోతున్నది.

అధికారుల అప్రమత్తం.. అవగాహన

గత ఏప్రిల్‌లో ప్రాణహిత నదిని దాటి జిల్లాలోకి ప్రవేశించిన ఓ ఏనుగు చింతలమానేపల్లి మండలం బూరెపల్లిలో అల్లూరి శంకర్‌ను, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో కారు పోశన్నను బలితీసుకున్న విషయం విదితమే. సరిహద్దు గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఏనుగు చివరగా పెంచికల్‌పేట్ మండలం వటాల గ్రామంలో ఓ గుడిసెను ధ్వంసం చేసింది. వటాల గ్రామ సరిహద్దు నుంచి ప్రాణహిత మీదుగా తిరిగి మహారాష్ట్రలోకి వెళ్లిపోయింది. దాదాపు ఆరునెలల తర్వాత మళ్లీ ఏనుగు జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలున్నట్లు అటవీ అధికారులకు సమాచారం రావడంతో అప్రమత్తమయ్యారు. పెంచికల్‌పేట్ మండలం జైహింద్‌పూర్, కొండపల్లి, లోడ్‌పల్లి, మేరగూడా, ఎర్రగుట్ట, ఎల్లూరు, అగర్‌గూడా, నందిగాం, కమ్మర్‌గాం, గుండెపల్లి, జిల్లెడ, ముర్లిగడా గ్రామాలు, చింతలమానేపల్లి మండలంలోని దిందా, గూడెం, కోర్సిని, గంగాపూర్, కేతిని గ్రామాలు ప్రాణహిత సరిద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ప్రాంతాల మీదుగానే ప్రవేశించే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. డప్పు చాటింపులతో అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగు వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తున్నారు. ట్రాకర్స్‌ను గ్రామాల్లోనే ఉంచి ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

మంచిర్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 25 : మంచిర్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ నుంచి జీవో ఎంస్ నం. 182 ద్వారా ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఈ అథారిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సర్కారు ప్రకటించింది. ప్రజల జీవన విధానంలో లక్ష్యాలను సాధించడానికి ఎంతగానో తోడ్పడుతుందని భావించింది. దీని పరిధిలోకి మంచిర్యాల పట్టణంతో పాటు ఆరు మున్సిపాలిటీలు, 350 గ్రామాలు వస్తాయని పేర్కొంది.

హైకోర్టులో కోవ లక్ష్మికి ఊరట

- ఎమ్మెల్యే ఎన్నిక చెల్లదని దాఖలైన పిటిషన్ కొట్టివేత
- హైకోర్టు చరిత్రలోనే సత్వర తీర్పు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి హైకోర్టులో ఊరట లభించింది. కోవ లక్ష్మి ఎన్నిక చెల్లదని, ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో తప్పులు ఉన్నాయని కాంగ్రెస్ నేత అజ్మీరా శ్యామ్ నాయక్ వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు శుక్రవారం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎన్నికను సవాల్ చేస్తూ ఆమె చేతిలో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యామ్ న్యాయక్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌పై ఈ నెల 1, 14, 16 తేదీల్లో న్యాయ మూర్తి విచారణ జరిపారు. ఈ మేరకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం 9 నెలల 20 రోజులకే తీర్పు వెలువరించి కొత్త అధ్యయానికి తెరతీసింది. ఆసిఫాబాద్ శాసనసభ ఎన్నికల్లో పిటిషనర్ శ్యామ్ నాయక్ (కాంగ్రెస్) 60,238 ఓట్లు, ప్రతివాది లక్ష్మి (బీఆర్ఎస్) 83,036 ఓట్ల చొప్పున సాధించారని, ఆమె 22,798 ఓట్ల ఆధిక్యంతో గెలుపొంది ప్రజా విశ్వాసాన్ని చూరగొన్నారన్నారు. అన్నింటినీ లోతుగా విచారణ చేసిన తర్వాత ఎమ్మెల్యే లక్ష్మి ఎన్నిక చెల్లదన్న పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, శుక్రవారం జస్టిస్ లక్ష్మణ్ వెలువరించిన తీర్పులో, ఈపీ సత్వర విచారణకు సహకరించిన వాదప్రతివాదుల తరపు న్యాయవాదులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

కేసు వివరాలిలా ..

కోవ లక్ష్మి నాలుగేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు ఎలక్షన్ అఫిడవిట్లో సమర్పించలేదు. వరుసగా ఐదేళ్ల ఐటీ రిటర్నులు సమర్పించాల్సి ఉందని, ఆమె ఎన్నికను రద్దుచేయాలని శ్యాంనాయక్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. నిబంధనల ప్రకారం ఆదాయం వివరాలు, పాన్ నెంబర్, ఆస్తులు, అప్పులు, ఆదాయాలు, స్థిరచరాస్తులతో పాటు భర్త ఆదాయం గురించి కూడా కోవ లక్ష్మి వెల్లడించారని గుర్తుచేసింది. ఐటీ రిటర్నులు ఒకే ఏడాది ఇచ్చారనే కారణంగా ఎన్నిక చెల్లదని ప్రకటించలేమని తేల్చి చెప్పింది. గత ఎన్నికల్లో 2022-23 ఆదాయపు పన్ను రిటర్నులు మాత్రమే కోవ లక్ష్మీ సమర్పించారని, అంతకు ముందు వరుసగా నాలుగేళ్ల ఐటీ రిటర్నులు ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో సమర్పించలేదని చెప్పి కోవ లక్ష్మి ఎన్నికను రద్దు చేయడానికి ఆస్కారం లేదని, ఎన్నికను రద్దు చేసి ఆమె బదులు తాను గెలుపొందినట్లుగా ప్రకటించాలనే పిటిషనర్ వాదన ఆమోదయోగ్యంగా లేదని న్యాయమూర్తి లక్ష్మణ్ తన తీర్పులో పేర్కొన్నారు.

పిటిషనర్ తరపున వాదన

పిటీషనర్ శ్యాం నాయక్ తరపున సీనియర్ న్యాయవాది సీ రఘు వాదిస్తూ 2018లో కూడా లక్ష్మి ఆసిఫాబాద్ నుంచే పోటీ చేసినప్పుడు 2017-18లో రూ. 5.10 లక్షలు ఆదాయం ఉందన్నారని, ఆ తరువాత ఆదాయాన్ని చూపలేదన్నారు. జడ్పీటీసీ ఎన్నికలప్పుడు రూ. 5.10 లక్షల ఆదాయం చూపారని, జడ్పీచైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నుంచి పొందిన రూ. లక్ష గౌరవ వేతనం (ఏడాదికి రూ. 12లక్షలు) పెన్షన్ జమ చేస్తే మొత్తం వార్షిక ఆదాయం రూ. 15.60 లక్షలను కూడా లక్ష్మి అఫిడవిట్‌లో చూపలేదన్నారు.

ప్రతివాది వాదన...

ఎమ్మెల్యే కోవ లక్ష్మి తరపున సీనియర్‌న న్యాయవాది జే రామచంద్ర రావు పిటిషనర్ ఆఫియోగాలకు తగిన ఆధారాలు చూపలేదని తప్పు బట్టారు. ఆస్తులు ఆదాయాలు, అప్పులు అన్నింటిని లక్ష్మి అఫిడవిట్‌లో వివరించారన్నారు. ఈపీ వేయడానికి తగిన కారణాలు లేవని, ఆధారాలు లేకుండా వేసిన ఈపీని డిస్మిస్ చేయాలని కోరారు. ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించలేదన్నదే వాదన ఆమోదయోగ్యం కాదన్నారు. విచారణ లో వివరాలన్నీ చెప్పినట్లు తెలిపారు.

ప్రజావిశ్వాసం పొందిన ప్రతివాది లక్ష్మి

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి లక్ష్మణ్ కోవల లక్ష్మి ఎన్నికను రద్దు చేసేందుకు వీల్లేదన్నారు. ఈ మేరకు సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పులను ఉదహరించారు. ఎమ్మెల్యేగా తీసుకున్న జీతం వివరాలు ఇచ్చారని, మాజీ ఎమ్మెల్యేగా పెన్షన్ తీసుకోలేదన్న వివరాలు కూడా ఇచ్చారన్నారు. లక్ష్మి నామినేషన్ దాఖలు సమయంలో పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలను రిటర్నింగ్ ఆఫీసర్ తిరస్కరించినట్లుగా ఆధారాలు చూపలేదన్నారు.

పద్మల్‌పురి కాకో ఆలయంలో భక్తుల సందడి

దండేపల్లి, అక్టోబర్ 25 : దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి తీరంలో ఉన్న పద్మల్‌పురి కాకో ఆలయంలో దండారీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కాకో అమ్మ వారిని దర్శించుకొని పూజలు చేశారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి గుస్సాడీ వేషధారణలో నృత్యాలు చేశారు. ఆలయ ఆవరణలో గానుగ నూనెతో చేసిన పిండి వంటలు అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. గిరిజన మహిళలు గోదావరి జలాలను తీసుకొచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మేకలు, కోళ్లు బలిచ్చి, ఆలయ ఆవరణలో సామూహిక భోజనాలు చేశారు.

కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నష్టపరిహారం అందించాలి

బెజ్జూర్, అక్టోబర్ 25 : ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో పంటలు నష్టపోయామని, వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో రైతులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాలకు వాగులతో పాటు ప్రాణహిత ఉప్పొంగి బ్యాక్ వాటర్‌తో పంటలు నీట మునిగాయని, అధికారులు పాపన్‌పేట, తక్కిపల్లి, తలాయి, సోమిని, మొగవెల్లి తదితర శివారుల గ్రామాల్లో సందర్శించారుగాని పంట నష్టం సర్వే చేయలేదని మండిపడ్డారు. వ్యవసాయ అధికారుల తప్పిదంవల్లే తీవ్రంగా నష్టపోయామని, వారిపై చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కౌటాల సీఐ ముత్యం రమేశ్ అక్కడికి చేరుకొని రైతులకో నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం తహసీల్దారు భూమేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు లంగారి శ్రీనివాస్, దుర్గం శంకర్, సిడం సకారా, బషారత్ ఖాన్ పాల్గొన్నారు.